
సాక్షి
నారాయణపేట
ఆదివారం । 14 । జూలై । 2024



కల్యాణం.. కమనీయం

విశ్వశాంతి మహాయాగంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు.

వివరాలు 10లో ▸



ఖిల్లా కోట కిటకిట

మొహర్రం పండుగ నేపథ్యంలో కోయిలకొండ కోట భక్తులతో కిటకిటలాడుతోంది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
29.4 /23.7

వాతావరణం

రోజులో ఎక్కువ శాతం ఆకాశం మేఘావృతం అవుతుంది. మొస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

గ్రామీణులను చైతన్యపరుస్తూ..

- గ్రామాల్లో సురక్ష పోలీసు కళాబృందం కార్యక్రమాలు, నాటకాలు
- బాల్యవివాహాల నుంచి సైబర్‌క్రైమ్ నేరగాళ్ల వరకు అవగాహన
- ఐదున్నరేళ్లలో.. 500 కార్యక్రమాలు
- జిల్లాలో సత్ఫలితాలు

నారాయణపేట రూరల్: సాంకేతిక పరిజ్ఞానం పెరిగినప్పటికి పల్లె జనాలు ఇంకా పాత ఆచారాలతోనే జీవిస్తున్నారు. ప్రభుత్వం మార్పు కోసం ఎంత ప్రయత్నాలు చేస్తున్నా.. మారని జనాల కోసం పోలీసు శాఖ చేస్తున్న వినూత్న కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. సురక్ష పోలీసు కళా బృందం ఆద్వర్యంలో గ్రామాలకు వెళ్లి జాగృతం చేస్తున్నారు. ఇలా నారాయణపేట జిల్లాలో గత ఐదున్నర సంవత్సరాలుగా నిర్వహిస్తున్న కార్యక్రమం 500 మైలు రాయిని దాటింది.

జిల్లాలో కార్యక్రమం ఇలా..

ఆలస్యంగా ఏర్పాటైన నారాయణపేట జిల్లాలో 13 పోలీసు స్టేషన్లు ఏర్పాటు కాగా వాటి పరిధిలో 280గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పల్లె జనాలను చైతన్య పరిచేందుకు నలుగురు సభ్యులతో కూడిన కళా బృందాన్ని అప్పటి ఎస్పీ చేతన ఏర్పాటు చేశారు. తదనంతరం దీన్ని వెంకటేశ్వర్లు, యోగేష్‌గౌతమ్ సైతం కొనసాగిస్తు వస్తున్నారు.



గ్రామాల్లో ఆటపాటతో అవగాహన కల్పిస్తున్న కళాబృందం (ఫైల్)

జిల్లా వివరాలిలా..

ఏడాది	కళాబృందం కార్యక్రమాలు
2019	120
2020	72
2021	67
2022	156
2023	115
2024 (జూన్)	52

ఈ బృందంలో సురేందర్‌గౌడ్ నేతృత్వంలో ముగ్గురు పీసీలు, ఒక హోంగార్డు రెగ్యులర్ సభ్యులుగా ఉండగా మరో ఇద్దరు మహిళలు అవసరం మేరకు ప్రోగ్రామ్స్‌లో పాలు పంచుకుంటున్నారు. 2019 మే 3న జిల్లాలో కార్యక్రమం ప్రారంభించగా అన్ని మండలాల్లో సంబంధిత సీఐ, ఎస్‌ఐలతో కలిసి అవగాహన సదస్సు, కళాబృందం నాటకాలు చేస్తున్నారు. వీటిలో స్థానిక ప్రజాప్రతినిధులను సైతం భాగస్వాములను చేస్తున్నారు. దీంతో గడిచిన 61 నెలల్లో దాదాపు జిల్లాలోని అన్ని గ్రామాల్లో కార్యక్రమాలు పూర్తి చేశారు.

అసత్య ప్రచారాలు.. మూఢనమ్మకాలపై..

అత్యవసర సమయంలో డయల్ 100ను ఉపయోగించుకోవాలని, బాల్యవివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థలు, బాలకార్మిక వ్యవస్థతో పిల్లలు ఎదుర్కొనే కష్టాలు, చట్ట ప్రకారం శిక్షలు ఇలా అన్నింటిపై అవగాహన కార్యక్రమాలు, నాటకాలతో ప్రజలను చైతన్యపరుస్తారు. అలాగే, మహిళల భద్రతకు ఏర్పాటు చేసిన షీటీమ్స్, సైబర్ క్రైమ్, ఇంటర్నెట్ మోసాలను ఎలా అరికట్టాలని చెప్తున్నారు. రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తే జరిమానాలు ఉంటాయని వివరిస్తున్నారు. దాదాపు 30 వరకు బాల్య వివాహాలను అడ్డుకున్నారు.

ప్రజల్లో మార్పు కోసమే..



ప్రజల్లో మార్పు తీసుకు రావడానికి జిల్లాలో సురక్ష పోలీసు కళాబృందం ఆద్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రతి పల్లెలో అక్కడి ప్రజాప్రతినిధులు, విద్యావంతులతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానానికి తగ్గట్లు వారిని అప్‌డేట్ చేస్తున్నాం. నేరాల నియంత్రణ, ఫ్రెండ్లీ పోలీసు వ్యవస్థకు ఇది దోహదపడుతుంది. ఇప్పటికే 500పైగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం పట్ల బృందం సభ్యులకు అభినందనలు. ఇకముందు మరిన్ని చైతన్య సదస్సులు నిర్వహించాలి.

– లింగయ్య, డీఎస్పీ, నారాయణపేట

న్యూస్‌రీల్

విద్యాభివృద్ధిలో అధికారులదే కీలక పాత్ర



నారాయణపేట: విద్యాభివృద్ధిలో అధికారులు కీలక పాత్ర వహించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతిక్ జైన్ అన్నారు. శనివారం కొడంగల్ క్యాంప్ కార్యాలయంలో నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నారాయణపేట, వికారాబాద్ జిల్లాలను విద్యావ్యవస్థలో రాష్ట్రంలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేయాలన్నారు. పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించేలా విద్యాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యా వలంటీర్లు అవసరం ఉన్న చోట సర్దుబాటు చేసేలా కృషి చేయాలన్నారు. విద్యావ్యవస్థలో కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్లు సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, డీఈఓ అబ్దుల్ ఘని, సెక్టరల్ అధికారులు శ్రీనివాస్,విద్యాసాగర్,రాజేందర్, పద్మ నళిని, నాగార్జున రెడ్డి,రాము పాల్గొన్నారు.

18 వరకు దోస్త్ రిపోర్టింగ్ గడువు పొడిగింపు

నారాయణపేట రూరల్: దోస్త్ ద్వారా మూడు విడతల్లో సీట్లు పొంది ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసిన వారు కళాశాలలో స్వయంగా వెళ్లి చేరడానికి గడువును ఈనెల 18 వరకు పొడగించినట్లు సీఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నారాయణగౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల కోరిక మేరకు ఉన్నత విద్యా మండలి ఈ నిర్ణయం తీసుకుందని, వెంటనే సంబంధిత విద్యార్థులు కళాశాలకు వచ్చి జాయిన్ కావాలని సూచించారు.

అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు


స్టేషన్ మహబూబ్‌నగర్: తమిళనాడులోని అరుణాచలం గిరి ప్రదక్షిణ చేయాలనుకునే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పట్టణాల నుంచి అరుణాచలం వెళ్లడానికి పది సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 19న రాత్రి బస్సులు బయలుదేరుతాయని, మరుసటి రోజు (20న) రాత్రికి అరుణాచలం చేరుకుంటాయన్నారు. మార్గమధ్యలో కాణిపాకం, వేలూర్ గోల్డెన్ టెంపుల్ దర్శనం ఉంటుందన్నారు. తిరిగి 21న సాయంత్రం ఈ బస్సులు అక్కడి నుంచి బయలుదేరి 22న ఉదయం ఆయా పట్టణాలకు చేరుతాయని చెప్పారు. పెద్దలకు రూ.3,600, పిల్లలకు రూ.2400 చార్జీ ఉంటుందని, టూర్ ప్యాకేజీని టీఎస్‌ఆర్టీసీ వెబ్‌సైట్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు మహబూబ్‌నగర్ బస్సు కోసం సెల్ నంబర్లు 94411 62588, 73828 27102, 99592 26286, నాగర్‌కర్నూల్ బస్సు కోసం 83092 14790, 73828 27638లను సంప్రదించాలని ఆమె సూచించారు.

నేడు పాలమూరులో జగన్నాథుడి రథయాత్ర

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలో ఆదివారం శ్రీజగన్నాథ రథయాత్ర మహోత్సవం నిర్వహించనున్నారు. జిల్లాకు చెందిన ధార్మిక సంస్థల సహకారంతో మూడోసారి శ్రీజగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. యూరోపియన్ దేశాలకు చెందిన పలువురు విదేశీయులు ఈ రథయాత్రలో పాల్గొని స్వామివారిని దర్శించుకుంటారని చెప్పారు. రథయాత్ర మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ కల్యాణ మండపం నుంచి ప్రారంభమై న్యూటౌన్, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా టీటీడీ కల్యాణ మండపానికి చేరుకుంటుందన్నారు.



ప్లా'స్టిక్' ట్రిట నిషేధం..!



- నల్లమల అభయారణ్యంలో కఠిన నిబంధనలు
- ఏటీఆర్, ఎన్ఎస్‌టీఆర్‌లో ప్లాస్టిక్ నిషేధం అమలు
- పెద్దపులులు, ఇతర వన్యప్రాణులకు హాని కలగకుండా చర్యలు
- ఇప్పటికే మన్ననూర్ చెక్‌పోస్టు ఆధునీకీకరణ

అచ్చంపేట: అమ్రాబాద్ టైగర్ రిజర్వు (ఏటీఆర్), నాగార్జున సాగర్ టైగర్ రిజర్వు (ఎన్ఎస్‌టీఆర్) ఫారెస్టులను ప్లాస్టిక్ రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల పీసీసీఎఫ్ డోబ్రియాల్, చిరంజీవి చౌదరి ఇటీవల దోమలపెంటలో సమావేశమై.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై నిషేధాన్ని కఠినతరం చేయాలని నిర్ణయించారు. మొదట తిరుపతి తరహాలో శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని ప్లాస్టిక్ ఫ్రీజోన్‌గా ప్రకటించారు. శ్రీశైలం, పర్యాటక ప్రాంతాల్లో యాత్రికుల తాకిడి ఎక్కువగా ఉన్నందున ప్లాస్టిక్ వినియోగం కూడా ఎక్కువగా ఉందని గుర్తించిన అధికారులు.. ప్లాస్టిక్‌ను నిర్మూలించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్టును ప్లాస్టిక్ ఫ్రీజోన్‌గా మార్చడంపై మే 29వ తేదీన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి పంచాయతీరాజ్, అటవీశాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో సమీక్ష అనంతరం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జూలై చివరి నాటికి పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించేందుకు అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ రెండు టైగర్ రిజర్వులతో పాటు ఉమ్మడి జిల్లాలోని నవాబుపేట మండలం ఫత్తేపూర్ మైసమ్మ అడవిలో కూడా ప్లాస్టిక్ నిషేధం అమలుకు అటవీశాఖ అధికారులు ఇప్పటికే శ్రీకారం చుట్టారు.



శ్రీశైలం రహదారిలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్న అటవీశాఖ సిబ్బంది (ఫైల్)

వన్యప్రాణులకు హాని కలగకుండా..

నల్లమల 2,611.30 చదరపు కి.మీ. విస్తీర్ణంలో విస్తరించి ఉంది. అందులో 2,116.37 చదరపు కి.మీ. అభయారణ్యం కాగా.. 445.02 చదరపు కి.మీ. బఫర్ జోన్‌గా ఉంది. అభయారణ్యంలో 25 పెద్దపులులు, 170 చిరుతలు, వందలాది ఎలుగుబంట్లు, జింకలు, సాంబర్లు, మనుబోతు, అడవి పందులు, నెమళ్లు, మూసిక జింకలు, అడవి కోళ్లు, దుప్పులు, అడవి కుక్కలు ఉన్నాయి. ఇటీవల పెద్దపులులు, చిరుతల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈనేపథ్యంలో ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల వన్యప్రాణులకు ఎలాంటి ప్రాణహాని కలగకూడదన్న ఉద్దేశంతో అటవీ శాఖ ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోంది.

ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిషేధం..



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అమ్రాబాద్ ఆభయారణ్యంలో ప్లాస్టిక్ నిషేధంపై కఠిన నిబంధనలు అమలు చేయనున్నాం. దీనిపై మన్ననూర్, దోమలపెంట చెక్‌పోస్టుల వద్ద యాత్రికులకు అవగాహన కల్పిస్తున్నాం. రహదారి వెంట ఉన్న గ్రామాల్లో ప్రజలు, వ్యాపారులకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించాం. పర్యావరణహిత ప్లేట్లు, కప్పులు శ్రీశైలం, ఉమామహేశ్వరం, మద్దిమడుగు పుణ్యక్షేత్రాల్లో ప్రసాద పంపిణీకి వాడేలా చర్యలు చేపడుతాం.

– రోహిత్ గోపిడి, డీఎఫ్‌ఓ

వ్యాపారులకు అవగాహన..

అభయారణ్యంలో ప్లాస్టిక్ నిషేధంపై హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిలోని మన్ననూర్, వట్టువర్లపల్లి, దోమలపెంట, ఈగలపెంట, పాతాళగంగ, సున్నిపెంట, శ్రీశైలంతో పాటు మన్ననూర్-మద్దిమడుగు రహదారిలోని అమ్రాబాద్, కుమ్మరోనిపల్లి, పదర, వంకేశ్వరం, చిట్లంకుంట తదితర గ్రామాల్లో ప్రజలు, వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా మానుకోవాలని.. గాజు సీసాలను వాడాలని సూచిస్తూ, వ్యాపారులకు నోటీసులు జారీ చేస్తున్నారు. కాగితపు సంచులు, జనపనార సంచులు, విస్తరాకులు, బట్ట సంచులు మొదలైన పర్యావరణ అనుకూల ఉత్పత్తులను వినియోగించాలని సూచిస్తున్నారు. హరిత నిధులను ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువుల తయారీకి వినియోగించేలా ప్రభుత్వం అనుమతించింది. వాహనాల్లో వెళ్లే పర్యాటకులు, భక్తులకు ఇప్పటికే అటవీశాఖ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. మన్ననూర్‌లో యాత్రికులకు తాగునీటి వసతి కోసం మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. రహదారి మార్గంలో మరికొన్ని ప్లాంట్లు ఏర్పాటు చేసేదిశగా అటవీ శాఖ ఆలోచన చేస్తోంది. మన్ననూర్‌లో ఇస్తరాకుల తయారీ కేంద్రం నెలకొల్పారు. దీన్ని ద్వారా 8 మంది ఉపాధి పొందుతున్నారు. ఇప్పటికే మన్ననూర్, దోమలపెంట, ఉమామహేశ్వరం, మద్దిమడుగు చెక్‌పోస్టులు ఉన్నాయి. మద్దిమడుగు, శ్రీశైలం వెళ్లే యాత్రికులు ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు తీసుకెళ్లకుండా చర్యలు చేపట్టేందుకుగాను మన్ననూర్ చెక్‌పోస్టును పునరుద్ధరించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వులో అవసరమైతే అదనపు చెక్‌పోస్టులను ఏర్పాటుచేసే దిశగా అటవీశాఖ అడుగులు వేస్తోంది.



ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ సిబ్బంది (ఫైల్)

సేకరించిన వ్యర్థాల రీసైక్లింగ్..



మన్ననూర్ సెంటర్‌లో సేకరించిన వ్యర్థాలు

శ్రీశైలం, పర్యాటక ప్రాంతాలను సందర్శించే భక్తులు, పర్యాటకులు అటవీ ప్రాంతంలోని రహదారులపై వాటర్ బాటిళ్లు, కవర్లు, ప్లాస్టిక్ ప్లేట్లు వదిలి వెళ్తున్నారు. వీటి సేకరణపై అటవీశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. వాటిని నిత్యం ఒక దగ్గరకి చేర్చేందుకు గాను చెంచు గిరిజనులను నియమించింది. సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలను మన్ననూర్ సెంటర్‌కు తరలిస్తున్నారు. అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలను వేరుచేసి, హైదరాబాద్ రీసైక్లింగ్ సెంటర్‌కు తరలిస్తున్నారు. ఇప్పటి వరకు 17వేల కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను రిసైక్లింగ్ సెంటర్‌కు తరలించారు. మరో 17 వేల కిలోల వ్యర్థాలు మన్ననూర్ సెంటర్‌లో నిల్వ ఉన్నాయి. ప్లాస్టిక్ రీసైక్లింగ్ చేయడం వల్ల అటవీ శాఖకు కిలోకు రూ.10 చొప్పున ఆదాయం సమకూరుతుంది. ఇది కొంతకాలంగా కొనసాగుతుండగా.. ప్రస్తుతం ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు అప్రమత్తమై జూలై చివరి నాటికి పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ నిషేధం జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు.

మక్తల్‌లో కలెక్టర్ సుడిగాలి పర్యటన



మక్తల్‌లో అసంపూర్తిగా మిగిలిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తదితరులు

- ఇంటిగ్రేటెడ్ మార్కెట్, మినీట్యాంక్ బండ్, హాస్టల్, పెద్ద చెరువు పరిశీలన
- అసంపూర్తి పనుల పూర్తికి కృషి : కలెక్టర్ సిక్తా పట్నాయక్

మక్తల్: స్థానిక మున్సిపాలిటీలో శనివారం కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సుడిగాలి పర్యటన చేశారు. మొదట ప్రభుత్వ ఆస్పత్రి, మహిళా సమాఖ్య భవనం, పెద్ద చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కలెక్టర్‌కు పలు విషయాలు వివరించారు. దాదాపు 10 ఏళ్లుగా మక్తల్ అభివృద్ధికి నిధుల్లేక చాలా పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయని, పలు ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, భవనాలు నిర్మించేందుకు స్థలాలు కరువయ్యాయని తెలిపారు. రూ.2 కోట్లతో నిర్మాణం చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ అసంపూర్తి దశలో ఉందని, మినీట్యాంకు బండ్ పనులు పూర్తికాలేదని అదనపు నిధులు అవసరమన్నారు. సబ్‌రిజిష్టర్ కార్యాలయం, ప్రభుత్వ ఆస్పత్రి, బాలికల వసతి గృహం, పశువులసంత, బాలుర బీసీ హాస్టల్, కోర్టు, మహిళా సమాఖ్య కార్యాలయాలు కొనసాగిచేందుకు భవనాలు, స్థలాలు లేవని పేర్కొన్నారు. డిగ్రీ కళాశాలకు భవనం లేకపోవడంతో మినీ స్టేడియంలో కొనసాగించడం జరుగుతుందని కలెక్టర్‌కు ఎమ్మెల్యే వివరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి : కలెక్టర్

మక్తల్ పట్టణంలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధికి కావాల్సిన నిధులు, స్థలాలపై నివేదిక ఇస్తే వాటి పరిష్కారానికి, నిధుల మంజూరుకు కృషి చేస్తానని కలెక్టర్ అన్నారు. అంతకు ముందు మహిళా సమాఖ్య భవనం వద్ద కలెక్టర్, ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఐసీడీఎస్ కార్యాలయం తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థులకు సిద్ధం చేస్తున్న యూనిఫామ్స్‌ను పరిశీలించారు.అలాగే, మక్తల్ మండలం కాట్రెవ్‌పల్లి రోడ్డు గుంతలమయంగా మారిందని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. అక్కడికి చేరుకొని రోడ్డును పరిశీలించారు. మరమ్మతు పనులు వెంటనే చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కమీషన్ బోగేశ్వర్, ఎంపిడిఓ గోవిందురావు, సీడీపీఓ సరోజినీ మట్ట, వైస్‌చైర్మన్ అఖిలరెడ్డి, కౌన్సిలర్ ప్రసన్నరెడ్డి, మల్లికార్జున్, తహసీల్దార్ సువర్ణరాజు, నారాయన్, గణేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

మరికల్: ప్రభుత్వ వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని.. వారిని సొంత ఇంటి పిల్లల మాదిరిగా చూసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ అన్నారు. ధన్వాడలో కొనసాగుతున్న మరికల్ కస్తుర్బా పాఠశాల, ధన్వాడ ఆదర్శ పాఠశాల వసతి గృహాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్, కస్తుర్బా పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. నాణ్యమైన భోజనం అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం, స్వచ్ఛమైన తాగునీరును అందించాలని, పరిసరాలతో పాటు మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచుకోవాలని హాస్టల్ సిబ్బందికి ఆదేశించారు. బాలికల వసతి గృహాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఎప్పటికప్పుడు పరిశీలించాలని, తల్లిదండ్రులు వస్తేనే విద్యార్థులను వారి ఇంటికి పంపించాలని, ఎవరైన బయటి వారు వస్తే పంపించవద్దాన్ని హెచ్చరించారు. అనంతరం విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రికార్డులను పరిశీలించారు.



కస్తూర్బా పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్

ప్రతి కేసుపై పారదర్శక విచారణ



మాట్లాడుతున్న డీఎస్పీ లింగయ్య

నారాయణపేట రూరల్: పోలీస్‌స్టేషన్లలో నమోదైన ప్రతి కేసుపై పారదర్శక.. వేగవంతమైన విచారణ చేపట్టాలని, పోక్సో, ఎస్సీ-ఎస్టీ గ్రేవ్ కేసుల విచారణ త్వరితగతిన పూర్తి చేయాలని డీఎస్పీ లింగయ్య సూచించారు. స్థానిక జిల్లా సబ్ డివిజన్ పోలీసు కార్యాలయంలో మక్తల్, కోస్గి సర్కిల్‌కు సంబంధించిన సీఐ, ఎస్‌లతో శనివారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, ఆలస్యానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను పరిశీలించారు. అదేవిధంగా పోక్సో కేసులు త్వరితగతిన విచారణ చేపట్టాలన్నారు. యూఐ టార్గెట్ కేసులను తగిచేందుకు యాక్షన్‌ప్లాన్‌పై తగు సూచనలు చేశారు. కేసుకు సంబంధించిన ప్రతి ఆధారాన్ని సంపాదించి, నేరస్తులకు కోర్టు ద్వారా తగిన శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 60 రోజుల్లో కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయాలన్నారు. కేసులకు సంబందించి ప్రతీది ఆన్‌లైన్ చేయాలని, నేరాల కట్టడికి అవసరమైన నివారణ చర్యలు చేపట్టాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా యువత, గ్రామీణ ప్రజలకు తగిన అవగాహన కల్పించాలని, డయల్ 100 ఫిర్యాదులను వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. పెట్రోలింగ్ విషయంలో నిర్లక్ష్యం లేకుండా చూడాలని, నిశేదిత వస్తువుల విక్రయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఐపీసీ, సీఆర్‌పీసీ, ఇండియన్ ఎవిడెన్స్‌యాక్ట్ బుక్కులను తరుచుగా చదువుతూ ఉండాలన్నారు. ఆత్మహత్య కేసులు అన్ని కోణాల్లో పర్యవేక్షించాలన్నారు. 5ఎస్ అమలుకు తగిన సూచనలు చేస్తూ పీఎస్ పరిశుభ్రత, ఫైల్స్ క్రమ పద్ధతిలో ఏర్పాటు చేసే విధంగా కిందిస్థాయి సిబ్బందికి సూచనలు చేయాలన్నారు. పీఎస్‌కు వచ్చే బాదితులకు భయం పోగొట్టి భరోసా అందించాలని, ప్రతి ఒక్కరితో మర్యాదగా నడుచుకోవాలన్నారు. సమావేశంలో సీఐలు చంద్రశేఖర్, దస్రునాయక్, ఎస్ఐలు భాగ్యలక్ష్మిరెడ్డి, ఎండీ నవీద్, ఎండీ అబ్దుల్‌ఖాదర్, బాలవెంకటరమణ, రామ్‌లాల్, ఐటీకోర్ టీమ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉరేసుకుని మాజీ సర్పంచ్ ఆత్మహత్య

మహమ్మదాబాద్: కుటుంబ సమస్యలతో మానసికంగా కృంగిపోయి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని మాజీ సర్పంచ్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన గండేడ్‌లో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గండేడ్ మండల కేంద్రానికి చెందిన తమ్మలి రాంచంద్రయ్య (68) గతంలో గండేడ్ సర్పంచ్‌గా పనిచేశాడు. కుటుంబంలో ఆర్థిక అవసరాల కోసం కొంతకాలంగా మానసికంగా బాధపడేవాడు. ఈ క్రమంలో తీవ్ర మనోవేదనకు గురై శనివారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో స్టోర్‌రూంలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతనికి కూతురు, కుమారుడు ఉన్నారు. భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

అయిజలో యువకుడి బలవన్మరణం


చెన్న కేశవరావు (ఫైల్)

అయిజ: కొంత కాలంగా మానసిక వైకల్యంతో బాధపడుతున్న యువకుడు చెట్టుకు ఉరేసుకుని మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఉప్పల క్యాంప్‌కు చెందిన చెన్నకేశవరావు(24) గతంలో సాఫ్ట్‌వేర్ జాబ్ చేశాడు. మూడు సంవత్సరాల నుంచి చెన్న కేశవ్‌రావ్ మెంటల్ డిజాడర్‌తో బాధపడుతున్నాడు. చెన్న కేశవరావు చిన్నాయన యోగీశ్వర్‌రావ్ అయిజ పట్టణంలో నివాసముంటున్నాడు. కొన్ని రోజులుగా యోగీశ్వరావు ఇంట్లోనే చెన్నకేశవరావు ఉంటున్నాడు. అయితే చెన్నకేశవరావు శనివారం తెల్లవారుజామున ఉప్పలదొడ్డి పేట సమీపంలోని నీటి సంపు వద్ద ఉన్న కానుగ చెట్టుకు ఉరివేసుకొని మృతిచెందాడు. మృతుడి తండ్రి మల్లికార్జున్‌రావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతదేహానికి గద్వాల ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించారు. మృతదేహానికి ఉప్పల క్యాంప్‌లో అంత్యక్రియలు నిర్వహించారు.

పురుగు మందు తాగి వ్యక్తి..

ఊర్కొండ: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం మండల పరిధిలోని రాచలపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రాచలపల్లికి చెందిన పుణ్యమూర్తి మల్లయ్య (49)మద్యం తాగేవాడు. ఈ విషయంలో భార్యాభర్తల మధ్యమనస్పర్థలు వచ్చాయి. గట్టిగా మందలించడంతో మన స్థాపానికి గురైన మల్లయ్య శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేశాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి శనివారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.

నిందితుడి రిమాండ్

పెబ్బేరు రూరల్: బాలిక(12)పై అత్యాచారానికి పాల్పడిన అదే గ్రామానికి చెందిన మైలారం అంజనేయులును శనివారం అరెస్టు చేశామని సీఐ నాగభూషణరావు తెలిపారు. ఈ మేరకు నిందితుడిని వనపర్తి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారని చెప్పారు.

గొర్రెపిల్లల చోరీ

గోపాల్‌పేట: మండలంలోని బుద్ధారంలో ముప్పై గొర్రెపిల్లలను దొంగలు ఎత్తుకెళ్లిన ఘటన శనివారం చోటుచేసుకుంది. గోపాల్‌పేట ఎస్‌ఐ హరిప్రసాద్ వివరాల మేరకు.. బుద్ధారం గ్రామానికి చెందిన నాగమ్మ, చంద్రయ్య భార్యాభర్తలు. వారికి గొర్ల మంద ఉంది. వారి పొలంపక్కనే గొర్లు నిలిపేవారు. ఎప్పటిలాగే ఈనెల 10న పొలంవద్ద గొర్లను నిలిపి చంద్రయ్య రాత్రి పడుకున్నాడు. రెండు గంటల సమయంలో లేచి చేశాడు. 30 గొర్రెపిల్లలు కనిపించలేదు. మరుసటిరోజు నుంచి ఎంత వెతికినా ఎక్కడా దొరకలేదు. గొర్రెపిల్లల విలువ సుమారు రూ.90వేలు ఉంటుందని, నాగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

- 14 మందితో రూ.2 లక్షల నగదు, 14 సెల్‌ఫోన్లు స్వాధీనం

ఉండవెల్లి: మండల కేంద్రం శివారులోని పంట పొలంలో శనివారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి 14 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసివెళ్లి ఉండవెల్లి శివారులోని భీమ్‌రెడ్డి(గొల్లోన్‌వాగు) ప్రాంతంలో పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేశారు. 14 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 104 పేక ముక్కలు, రూ.2,11,860 నగదు, 14 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. వారంతా కర్నూల్, వనపర్తి జిల్లాలకు చెందిన వారీగా పేర్కొన్నారు.

సెమీస్‌కు చేరిన పాలమూరు

ఫుట్‌బాల్ టోర్నీలో లీగ్ మ్యాచ్‌లు పూర్తి


ఫుట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

కల్వకుర్తి టౌన్: తెలంగాణ రాష్ట్ర 10వ బాలికల సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీలో లీగ్ మ్యాచ్‌లు పూర్తిచేసుకొని నాలుగు జట్లు సెమీస్‌కు చేరుకున్నాయి. శనివారం జరిగిన 9 మ్యాచ్‌లలో నాలుగు జట్లు సెమీస్ చేరుకున్నాయని ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి భానుకిరణ్ తెలిపారు. ఈ క్రమంలో రెండోరోజు రసవత్తరంగా జరిగిన మ్యాచ్‌లలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు సెమీస్‌కు అర్హత సాధించగా.. నల్లగొండ, ఖమ్మం, నిజామాబాద్ జట్లు సెమీస్ దశకు చేరుకున్నాయి. శనివారం జరిగిన మ్యాచ్‌లకు జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. లీగ్ మ్యాచ్‌లకు ముందు ఆయా జట్లు ప్రాక్టీస్‌ను కొనసాగించాయి.

మెడికల్ క్యాంపు ఏర్పాటు

ఫుట్‌బాల్ సబ్ జూనియర్ పోటీలు జరుగుతున్న పట్టణంలోని స్టేడియం గ్రౌండ్‌లో క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రఘుపతిపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. అత్యవసరమైతే వెంటనే వారిని ఆస్పత్రికి తరలించేలా 108 అంబులెన్స్ సైతం అందుబాటులో ఉంచారు. ఆయా జిల్లాలకు చెందిన కోచ్‌లు క్రీడాకారుల ఫిట్‌నెస్‌ను పరిశీలించిన తర్వాతనే పోటీల్లో పాల్గొనేలా చూశారు. లీగ్ దశలు పూర్తయి నాకౌట్ దశకు చేరుకోగా.. ఆదివారం నాకౌట్ చేరుకున్న టీంలలో గెలుపొందిన రెండు జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఫైనల్ మ్యాచ్ అనంతరం గెలుపొందిన జట్లకు బహుమతుల ప్రదానం ఉంటుందని భానుకిరణ్ తెలిపారు.

రసవత్తరంగా పోటీలు..

శనివారం జరిగిన 9 మ్యాచ్‌లలో పాలమూరు జట్టు ఉత్తమంగా రాణించి సెమీస్‌కు చేరుకుంది. రెండోరోజు మ్యాచ్‌లలో భాగంగా జట్టులోని క్రీడాకారులు ప్రతిభకనబరిచారు. నిజామాబాద్- మహబూబ్‌నగర్, మెదక్- ఖమ్మం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. ఖమ్మం- మంచిర్యాల జట్లు తలపడగా 1- 0 తేడాతో ఖమ్మం, నిజామాబాద్- వనపర్తి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 3- 0 తేడాతో నిజామాబాద్ జట్టు విజయాన్ని నమోదు చేశాయి. రంగారెడ్డి- కరీంనగర్ జట్ల మధ్య మ్యాచ్‌లో 5- 0 తేడాతో రంగారెడ్డి, మెదక్- నల్లగొండ మధ్య జరిగిన మ్యాచ్‌లో 4- 0 తేడాతో నల్లగొండ, రంగారెడ్డి- వనపర్తి మధ్య జరిగిన మ్యాచ్‌లో 1- 0 తేడాతో వనపర్తి విజయాన్ని కై వసం చేసుకున్నాయి. మంచిర్యాల- నల్లగొండ మధ్య జరిగిన మ్యాచ్‌లో 3- 0 తేడాతో నల్లగొండ, మహబూబ్‌నగర్- వనపర్తి మధ్య జరిగిన మ్యాచ్‌లో 1- 0 తేడాతో మహబూబ్‌నగర్ గెలుపొందింది.


స్టేడియం గ్రౌండ్‌లో ప్రాక్టీస్ చేస్తున్న ఉమ్మడి పాలమూరు జట్టు

660 సర్జికల్ ఆపరేషన్లు చేసిన ఎమ్మెల్యే

- ముగిసిన సర్జికల్ క్యాంపు
- 20న ఉచిత మోగా కార్డియాలజీ శిబిరం
- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ విజ్ఞప్తి


అచ్చంపేట ఏరియా ఆస్పత్రిలో ఉచిత సర్జికల్ ఆపరేషన్ల అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట: అచ్చంపేట ఏరియా ఆస్పత్రిలో ఉచిత సర్జికల్ క్యాంపు శనివారంతో ముగిసింది. రెండు నెలల క్రితం ఎంత మందికైన ఉచితంగా సర్జికల్ ఆపరేషన్లు చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ చెప్పిన విధంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రభు, ఇతర వైద్యుల సహకారంతో ఈ క్యాంపు ద్వారా 660 మందికి ఆపరేషన్లు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నల్లమల ప్రాంతంలో పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సర్జికల్ క్యాంపులో అనస్తీషియా సహకరించకోవడంతో వంద మందికి ఆపరేషన్లు చేయలేకపోయామన్నారు. మరో 200 మందిని హైదరాబాద్‌కు రెఫర్ చేసి ఆపరేషన్లు చేయించామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు, వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చొరవతో ఉచిత వైద్యం అందించగలిగామన్నారు. ఈప్రాంత ప్రజల కోసం పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తామన్నారు.

20న ఉచిత కార్డియాలజీ క్యాంపు

అచ్చంపేట ఏరియా ఆస్పత్రిలో ఈనెల 20న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సీబీఎం ట్రస్టు ఆధ్వర్యంలో హైదరాబాద్ కేర్ ఆస్పత్రి వారి సహకారంతో ఉచిత కార్డియాలజీ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రభు ఇందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. నరాలు, గుండె, ఎముకలకు సంబంధించిన అన్ని రకాల ఆపరేషన్లు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మహేష్, బాల్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

సారా కేంద్రంపై ఎక్సైజ్ దాడులు

- 1,500 కిలోల బెల్లం, 40 కిలోల పటిక స్వాధీనం
- నలుగురిపై కేసు నమోదు


వాహనంతో పాటు బెల్లం, పటిక, సారాను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

లింగాల: సారా తయారీ కేంద్రంపై ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ శాఖ డీపీఈఓ గాయత్రి ఆదేశాల మేరకు శనివారం దాడులు చేశారు. దాడిలో 1,500 కిలోల బెల్లం, 40 కిలోల పటిక, 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రమణయ్య తెలిపారు. బెల్లం, పటిక, సారాతో పాటు తుఫాన్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. 150 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. రాయవరానికి చెందిన వడ్త్యా శ్రీనునాయక్, ముక్కిడిగుండానికి చెందిన బిజినేపల్లి భాస్కర్, రాంబాబు, కర్ణాటక రాష్ట్రం గుర్మిట్కాల్‌కు చెందిన హన్మంతునాయక్‌పై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడిలో ఎక్సైజ్ ఎస్‌ఐ జనార్దన్, సిబ్బంది గోపాల్‌రెడ్డి, క్రిష్ణ, నాగార్జున, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఎండు గంజాయి పట్టివేత


అరెస్టు చేసిన గంజాయి విక్రయదారులు

మహబూబ్‌నగర్ క్రైం: ఇంట్లో ఎండు గంజాయి నిల్వ ఉంచుకుని విక్రయించే ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేయడంతోపాటు 305 ఎండు గంజాయి సీజ్‌చేశారు. ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని రామయ్యబౌలిలో శనివారం ఎక్సైజ్ జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం చేసిన తనిఖీల్లో ఓ ఇంట్లో 305 గ్రాముల ఎండు గంజాయి లభించింది. దీంతోపాటు హరిచందర్, రుడావత్ రవికాంత్, కడసాని శివ అనే ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ముగ్గురు యువకులు కొన్ని రోజులుగా దూల్‌పేట్ నుంచి ఎండుగంజాయి తీసుకువచ్చి వీరు తాగడంతోపాటు విక్రయించడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో మూడు రోజుల నుంచి సదరు ఇంటిపై నిఘా ఉంచి శనివారం పట్టుకున్నట్లు తెలిపారు. ముగ్గురు యువకులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో డీటీఎఫ్ సీఐ కవిత, ఎస్‌ఐ సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో కూరగాయల విక్రయం



తాజా కూరగాయలు అంటూ ఓ మహిళ చెప్పడం.. చూసిన వెంటనే కొందరు మహిళలు వాటిని కొనేయడం చకచకా జరిగిపోయాయి. అయితే ఇదేదో కూరగాయల మార్కెట్‌లో జరిగిన సంఘటన కాదు.. ఆర్టీసీ బస్సులో చోటుచేసుకున్న విక్రయాలు. మహమ్మదాబాద్‌లో ఓ మహిళ ఆర్టీసీ బస్సు ఎక్కి.. తాజా కూరగాయలు అని చెప్పడంతో కొందరు మహిళా ప్రయాణికులు కొనుగోలు చేసిన వీడియో శనివారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' పథకం మహిళలకు ఈ రకంగా కూడా ఉపయోగపడుతుందని పలువురు చమత్కరించుకున్నారు.

- మహమ్మదాబాద్

సెలవు రోజు పాఠశాలల నిర్వహణ

రూ.50 వేల చొప్పున జరిమానా


ప్రైవేట్ స్కూల్‌లో విద్యార్థి సంఘం నాయకులు, ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న ఎంఈఓ

జడ్చర్ల టౌన్: నిబంధనలకు విరుద్ధంగా రెండో శనివారం సెలవుదినం తరగతులు నిర్వహించినందుకు మండలంలోని మూడు పాఠశాలల్లో ఒక్కో పాఠశాలకు రూ.50 వేల జరిమానా విధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. జడ్చర్ల మండలంలోని ఓ మూడు ప్రైవేట్ పాఠశాలలు రెండో శనివారం సెలవు రోజు తరగతులు నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకులు ఓ స్కూల్‌కు చేరుకుని నిబంధనలు పాటించాలని, తరగతులు నిర్వహించరాదని నినదించారు. దీంతో ప్రిన్సిపాల్ విద్యార్థి సంఘం నాయకులపై దురుసుగా ప్రవర్తించారు. ప్రిన్సిపాల్ పోలీసులకు సమాచారం ఇవ్వటంతో వారు అక్కడికి చేరుకుని నిరసన విరమించాలని సూచించారు. అయినప్పటికీ వారు ఆందోళన విరమించకుండా నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన ఎంఈఓ మంజులాదేవిని పాఠశాలను సందర్శించాలని సూచించారు. డీఈఓ ఆదేశాల మేరకు ప్రైవేట్ స్కూల్‌కు చేరుకున్న ఎంఈఓ సెలవు రోజుల్లో పాఠశాలలు నిర్వహించరాదని ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఆమె సూచనలతో విద్యార్థులను ఇళ్లకు పంపించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి పాఠశాల సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తే.. చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో తరగతులు నిర్వహించిన మూడు పాఠశాలలకు ఒక్కో పాఠశాల నుంచి డీసీఈబీ బోర్డుకు రూ.50 వేల చొప్పున డీడీ పంపించాలని ఆదేశించామన్నారు. సీఆర్‌పీలను పంపించి మిగితా రెండు పాఠశాలల్లోనూ తరగతుల నుంచి విద్యార్థులను ఇళ్లకు పంపించినట్లు తెలియజేశారు.

మొసలి పట్టివేత



మాగనూర్: మండలంలోని తళంకేరి-కొత్తపల్లి గ్రామాల శివారులోని సంగంబండ కుడి హై లెవల్ కెనాల్‌లో మొసలిని ఫారెస్టు అధికారులు పట్టుకున్నారు. ఫారెస్టు అధికారి నీలేష్ వివరాల ప్రకారం.. సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా కుడి హై లెవల్ కెనాల్‌లోకి ప్రవేశించింది. కెనాల్‌లో నీరు తక్కువగా ఉండటంతో ఆ వైపు వెళ్లిన తళంకేరి యువకులు గమనించి ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. దీంతో కెనాల్ దగ్గరకు చేరుకున్న ఫారెస్టు అధికారులు గంటపాటు శ్రమించి మొసలిని గ్రామస్తుల సహాయంతో బంధించారు. అనంతరం మొసలిని అక్కడి నుంచి కృష్ణ మండలం వాసునగర్ సమీపంలోని కృష్ణనదిలోకి వదిలేశారు.

'మద్యం' లారీకి తప్పిన ముప్పు



కాల్వలో కూరుకుపోయిన మద్యం లారీ

అడ్డాకుల: డిపో నుంచి మద్యం తీసుకెళ్తున్న లారీ అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. ఈ సంఘటనలో ముప్పు తప్పింది. వనపర్తి జిల్లా పెబ్బేర్ మండలంలోని రంగాపూర్ మద్యం డిపో నుంచి లారీలో మద్యాన్ని మెదక్ జిల్లాకు తరలిస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత రంగాపూర్ నుంచి మద్యం లోడుతో వెళ్తున్న లారీ 44వ నంబర్ జాతీయ రహదారిపై కొమిరెడ్డిపల్లి శివారులో అదుపు తప్పింది. బస్సును తప్పించే క్రమంలో లారీని డ్రైవర్ రాఘవేందర్ పక్కకు తిప్పడంతో లారీ రోడ్డు కిందకు దూసుకెళ్లింది. కొంత దూరం వెళ్లి చిన్న కాల్వలో కూరుకుపోయింది. అదృష్టవశాత్తు లారీలో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. లారీలో ఉన్న మద్యాన్ని శనివారం మరో లారీలోకి మార్చి మెదక్‌కు తరలించారు. జడ్చర్ల ఎక్సైజ్ సీఐ విప్లవరెడ్డి, ఎస్‌ఐ నాగరాజులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పాలెంలో చోరీ

బిజినేపల్లి: మండలంలోని పాలెం గ్రామంలో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన సంఘటన శనివారం వెలుగు చూసింది. పాలెం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు ప్రహ్లాద్ శుక్రవారం ఇంటికి తాళం వేసి గద్వాలకు కుటుంబంతో సహా వెళ్లాడు. తిరిగి శనివారం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు విరగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి పరిశీలించగా బీరువాలో దాచిన రూ.50 వేల నగదు, రెండు తులాల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

బాలిక మృతదేహం కోసం కృష్ణానదిలో గాలింపు


మంచాలకట్ట సమీపంలో కృష్ణానదిలో బోట్‌తో వెతుకుతున్న పోలీసులు

పెంట్లవెల్లి: బాలికను అత్యాచారం చేసి హత్య చేసిన సంఘటనలో బాలిక మృతదేహం కోసం పోలీసులు కృష్ణానదిలో శనివారం సాయంత్రం వెతకడం ప్రారంభించారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల జిల్లా, పగిడాల మండలం, ముచ్చుమారిలో మద్దిలేటి సుజాతల దంపతుల కుమార్తె వాసంతి(8)ని అదే గ్రామానికి చెందిన ముగ్గురు బాలురు అత్యాచారం చేసి హత్య చేశారు. ఈ సంఘటనలో భాగంగా శనివారం పెంట్లవెల్లి మండలం, మంచాలకట్ట సమీపం వద్ద కృష్ణానదిలో తెలంగాణ, రాయలసీమ మధ్యలో ప్రవహిస్తున్న కృష్ణానదిలో ఆ బాలిక మృతదేహం కోసం నంద్యాల ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 4.30 గంటలకు వెతకడం ప్రారంభించారు. ఐదు రోజుల నుంచి ముచ్చుమారు సమీపంలోని ఎత్తిపోతల కాల్వలో వెతికినా.. ఫలితం లేకపోవడంతో కృష్ణానదిలో ప్రత్యేక బలగాలతో, మత్స్యకారులతో వెతికించారు. కుటుంబ సభ్యులు, ప్రజలు కృష్ణానదిన పెద్దఎత్తున వాసంతి మృతదేహం కోసం వేచి చూస్తున్నారు.

రేషన్‌బియ్యం పట్టివేత


పెద్దకొత్తపల్లిలో రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనం పట్టుకున్న పోలీసులు

పెద్దకొత్తపల్లి: బులెరో వాహనంలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా దేవల్‌తిరుమలాపూర్ గ్రామ శివారులోని కేఎల్‌ఐ కాల్వ వద్ద పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు. కోడేరు మండల కేంద్రానికి చెందిన పాడేన్ల రవి తన బులెరో వాహనంలో 21 సంచుల (8క్వింటాళ్ల)రేషన్ బియ్యాన్ని చంద్రకల్ గ్రామంలో ప్రజల నుంచి కొనుగోలు చేసి తరలిస్తున్నాడు. వాహనాన్ని ఎస్‌ఐ సతీష్ పట్టుకొని పౌరసరఫరాల శాఖ అధికారి రామ్మోహన్‌కు అప్పగించారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పట్టుకున్న బియ్యాన్ని స్థానిక డీలర్ కన్నయ్య వద్ద ఉంచినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రామ్మోహన్ తెలిపారు.

కర్వెన ప్రాజెక్టు కట్టపై నిలిచిన వర్షం నీరు

- కొన్ని చోట్ల కోతకు గురైన కట్ట బయటి భాగం


కర్వెన ప్రాజెక్టు కట్టపై నిలిచిన వర్షం నీరు


కర్వెన ప్రాజెక్టు వద్ద కోతకు గురైన కట్ట

భూత్పూర్: పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా కర్వెన వద్ద చేపడుతున్న ప్రాజెక్టు కట్టపై పలు చోట్ల వర్షం నీరు నిలిచింది. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా కట్ట బయట భాగాన కట్ట కోతకు గురైంది. కర్వెన ప్రాజెక్టులో భాగంగా 13, 14, 15 ప్యాకేజీలు నిర్మాణం పనులు చేపడుతున్నారు. కట్టలోపల రాతి కట్టడం పనులు కొనసాగుతున్నాయి. 14వ ప్యాకేజీ కట్టపై పలు చోట్ల నీరు చేరడంతో పాటు, కట్ట బయట భాగం కొన్ని చోట్ల కోతకు గురైంది. ప్రాజెక్టు పర్యవేక్షణ ఇంజినీరింగ్ అధికారులు చొరవ తీసుకొని కట్టపై నిలిచిన నీరు తొలగించకుంటే, కోతకు గురైన కట్టను మరమ్మతు చేయకుంటే కట్ట మరింత కోతకు గురయ్యే ప్రమాదం ఉంది.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

- MSR Developers కొరకు తెలంగాణ / ఆంధ్రాల్లో మార్కెటింగ్ సిబ్బంది కావలెను & మీరు ఉన్న ఏరియాల్లోనే లేఅవుట్ వెంచర్ ఫాం ల్యాండ్ పార్ట్‌నర్స్ కావలెను. ఫోన్: 8199940666

SERVICES

CHANGE OF NAME

- I, SAJJAN GANDLA MAHESH KUMAR S/o SAJJAN GANDLA CHANDRASEKHAR, R/o H.No: 8-2-53, Camel street, Gadwal, Jogulamba Gadwal Dist.T.G, hereby state my name was recorded in my passport bearing No S7390977 is SAJJAMN GANDLA MAHESH KUMAR. My actual and correct name is SAJJAN GANDLA MAHESH KUMAR.

ORTHOPEDIC SURGEON

- డా॥యస్.రవితేజ రెడ్డి, M.S., (ORTHO) (KMC మణిపాల్) ఎముకలు, నరములు, వెన్నెముక & కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు. శిరీష పాలీ క్లినిక్, అపోలో హాస్పిటల్ ప్రక్కన, 3వ లైన్, N.R.పేట, కర్నూలు. 08518 - 228666, 83412 98666.

HEALTH CARE

GYNECOLOGY

- కార్తీక్ హాస్పిటల్, సుంకేసుల రోడ్, కర్నూలు. సంతాన సమస్యలు, స్త్రీ వ్యాధులు, జనరల్, బి.పి., షుగర్ వ్యాధులకు ఉత్తమ చికిత్స. EHS సౌకర్యం కలదు. డా॥ యస్.చంద్రశేఖర్, M.D. ఫిజీషియన్, డా॥పార్వతీదేవి, M.D.,DGO., స్త్రీ వ్యాధి, ల్యాపరోస్కోపి నిపుణులు. టైమింగ్స్:10-8PM, 08518-226162.

సాక్షి భవిత విద్యార్థుల కోసం

WANTED

- మహబూబ్‌నగర్‌లో హోమ్ లోన్స్‌లో ఫీల్డ్ వర్కులో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం: 10,000 నుండి 20,000 CALL: 9493112774
- పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376.
- వ్యవసాయ అనుభవం ఉన్నసూపర్‌వైజర్స్ & కర్ణాటక, మహారాష్ట్రలో పని చేయుటకు లిఫ్ట్ ఇరిగేషన్‌లో అనుభవం ఉన్న సూపర్‌వైజర్స్ కావలెను. సంప్రదించండి: PVC PROJECTS. Call: 040-23338080 (Monday-Saturday 10am- 6pm), Email: frontdesk.vineela@gmail.com
- HYD లోని ప్రముఖ దేవాలయం (రామాలయం)లో పనిచేయుటకు అనుభవం గల శ్రీవైష్ణవ/బ్రాహ్మణ అర్చకులు కావలెను. మంచి జీతం + వసతి CV TO: 9985382832

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, [illegible] - సాక్షి మేనేజర్

పేదలకు ఎసరు!

దళిత, పేద రైతులకు యాజమాన్య హక్కులివ్వడం తప్పా?

- దశాబ్దాలుగా తమ భూములపై హక్కులు లేకుండా బతికిన పేద రైతులు
- వారిని సంపూర్ణ భూ యజమానులుగా మార్చేందుకే అసైన్డ్ చట్టం తెచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- ఇదివరకెన్నడూ లేని విధంగా 27 లక్షల మంది రైతులకు లబ్ధి
- తమ భూములపై హక్కులొచ్చాక కొందరు రైతులు అమ్ముకుంటే మీకేంటి బాధ?
- 'తల్లికి వందనం'పై దొంగాట నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే దుష్ప్రచారం

అసైన్డ్ భూముల రైతులకు చరిత్రాత్మక రీతిలో వైఎస్ జగన్ హయాంలో దక్కిన యాజమాన్య హక్కులను ప్రశ్నించేలా ఎల్లో మీడియా.. ప్రధానంగా 'ఈనాడు' వింత ధోరణి ప్రదర్శిస్తోంది. వారి భూములపై వారికి హక్కులు ఇవ్వడమే నేరమన్నట్లు వక్ర భాష్యాలు చెబుతోంది. పేద రైతులు, దళితులు ఇంకా బానిసత్వంలోనే బతకాలని కోరుకుంటోంది. వారి భూములకు వారు యజమానులుగా మారడం సరికాదంటూ ఏడుపుగొట్టు రాతలతో దుష్ప్రచారం చేస్తోంది. పేదలు, దళితులు ఆర్థికంగా ఎదగడానికి వీల్లేదంటూ పెడబొబ్బలు పెడుతూ కోడిగుడ్డుపై ఈకలు పీకుతోంది.

దశాబ్దాలుగా తాము సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు లేక రాష్ట్రంలో లక్షలాది మంది అసైన్డ్ రైతులు అష్టకష్టాలు అనుభవించారు. ఏళ్ల తరబడి ఆ భూములకు హక్కులివ్వాలని ప్రాధేయపడినా ఏ ప్రభుత్వం కనికరించలేదు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా వైఎస్ జగన్ ప్రభుత్వంలో దళిత, ఇతర పేద రైతులకు ప్రభుత్వాలు ఇచ్చిన భూములకు యాజమాన్య హక్కులు లభించాయి. తద్వారా 20 ఏళ్లకు పైబడి తమ ఆధీనంలో ఉన్న అసైన్డ్ భూములపై పేద, దళిత రైతులకు సంపూర్ణ అధికారాలు దఖలు పడ్డాయి. లక్షలాది మంది పేద రైతులు వారి భూములపై యాజమాన్య హక్కులు పొంది సంపూర్ణ రైతులుగా మారారు. తమ భూములపై ఆంక్షలు లేకపోవడం, మంచి ధర రావడంతో కొంత మంది రైతులు వాటిని విక్రయించారు. ఆ సొమ్ము ద్వారా పిల్లల ఉన్నత చదువులు, పెళ్లిళ్లు, ఇళ్లు, ఇతరత్రా ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కారు. చంద్రబాబు అండ్ గ్యాంగ్‌ను వెనకేసుకొస్తున్న 'ఈనాడు'కు ఇది ఏమాత్రం గిట్టడం లేదు.

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అసైన్డ్ భూముల చట్టాన్నే అపహాస్యం చేసేలా ఈనాడు, ఇతర ఎల్లో మీడియా దిగజారి వ్యవహరిస్తోంది. అసైన్డ్ భూములకు ఎసరు పెట్టేశారంటూ పేద, దళిత రైతులు తమ భూములపై నిర్ణయం తీసుకోవడాన్ని అవమానకరంగా వక్రీకరిస్తోంది. ఆ భూములను అధికారులు, వైఎస్సార్‌సీపీ నేతలు కారుచౌకగా కొనుగోలు చేశారని నిరాధారంగా నిందిస్తోంది. పేద రైతులు కొత్తగా వచ్చిన యాజమాన్య హక్కుల ఆధారంగా తమ భూమిని అమ్ముకుంటే దాన్ని ఇన్‌సైడర్ ట్రేడింగ్ అంటూ విపరీత అర్థాలు తీస్తోంది. ఎంత మంది పిల్లలుంటే అంత మందికి ఏటా రూ.15 వేల చొప్పున 'తల్లికి వందనం' పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు తల్లికి మాత్రమే ఇస్తామని బొంకుతున్న విషయం బయట పడటంతో.. తమ మోసాన్ని ప్రజలు గ్రహించకుండా దృష్టి మళ్లించడానికి 'చంద్రబాబు అండ్ కో' అసైన్డ్ హక్కుల వ్యవహారాన్ని తెర మీదకు తెచ్చింది. మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంపై దృష్టి పెట్టకుండా, ప్రజలకు మేలు చేసేలా గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ఎలా తొలగించాలన్న దానిపైనే చంద్రబాబు ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా ఎల్లో మీడియా, ప్రధానంగా ఈనాడు శకుని పాత్ర పోషిస్తోంది. ఏ ప్రభుత్వమైనా ఒక కార్యక్రమాన్ని అమలు చేసినప్పుడు ఎలాంటి పక్షపాతం లేకుండా పరిశీలించి.. ఇంకా ఎలా మంచి చేయొచ్చు అని చెప్పే బాధ్యత పత్రికలకు ఉంటుంది. కానీ మేలు చేస్తున్న కార్యక్రమాలను ఎత్తివేయాలని, తీసివేయాలంటూ పనిగట్టుకుని తప్పుడు రాతలు రాయడం దారుణం. దీనివల్ల అంతిమంగా నష్టపోయేది పేద వాళ్లు. పేదలకు నష్టం చేయడానికే రాష్ట్ర ప్రభుత్వం, ఎల్లో మీడియా ఉన్నట్లు మరోసారి రుజువైంది. చంద్రబాబు, తాము బాగుంటే చాలని ఈనాడు కిరణ్ అనుకోవడం దుర్మార్గం.

అసైన్డ్ భూములు దోచిందెవరు?

నిజంగా అసైన్డ్ భూముల విషయంలో అక్రమాలకు పాల్పడింది ఎవరు? గతంలో చంద్రబాబు ప్రభుత్వం కాదా? రాజధాని పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులను మభ్యపెట్టి, మోసం చేసి 1,100 ఎకరాలు కొట్టేశారు. వాళ్ల చేతిలో ఉంటే పరిహారం రాదని, ప్లాట్లు రావని చెప్పి లాగేసుకున్నారు. ఆ తర్వాత జీవో ఇచ్చి చేతులు మారిన భూములను పూలింగ్‌లోకి తీసుకుని టీడీపీ బినామీలకు ప్లాట్లు కేటాయించి కోట్లు కొల్లగొట్టారు. 1,336 మంది బినామీలు ఇలా ఉన్నారు. దీనిపై కేసు నడుస్తోంది. ఈ కేసు దర్యాప్తు ఎంత వరకు వచ్చిందని ఇదే ఈనాడు ఏనాడైనా నాలుగు వాక్యాలు రాసిందా? అసైన్డ్ భూముల సమస్య ఈనాటిది కాదు. పేదలు, రైతులు అందరూ ఇబ్బందులు పడుతున్నారు. భూమి ఉన్నాం కష్టం వస్తే.. దాన్ని ఏదోలా ఉపయోగించుకుందామన్నా.. చేసుకోలేని పరిస్థితి. పైసాకో, పరక్కో ఏదో ఒక కాగితం మీద రాసిచ్చి ఎంతో కొంత తీసుకునే పరిస్థితి. రికార్డుల్లో ఒక పేరు.. భూమి దగ్గరకు వస్తే మరొకరి పేరు. దేనికీ పొంతన లేదు. ఒకరేమో కష్టం తీర్చుకోవడం కోసం అమ్ముకుంటే, దాన్ని కొనుక్కున్నవాడికీ కంటిమీద కునుకులేని పరిస్థితి. ఈ నేపథ్యంలో పేదలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అసైన్డ్ భూముల చట్టానికి సవరణలు చేసింది. గత ఏడాది అక్టోబరు 27న దీనికి సంబంధించి గెజిట్ జారీ అయ్యింది. నిజంగా ఎవరో ఒకరికి లబ్ధి చేకూర్చాలనుకుంటే.. ఎవరి ఆధీనంలో భూమి ఉంటే వారికే ఇచ్చేయండి అని చెప్పేవారు. కాని అలా జరగలేదు. ఏ పేదవాడు అయితే లబ్ధిదారో, ఒరిజనల్ అసైనీగా ఉన్నాడో, వారు లేకపోతే వారసులు ఎవరున్నారో వారికే సర్వహక్కులూ ఇవ్వండని చెప్పింది. ఇందులో తప్పు ఏముంది? ఇప్పుడు వీరందర్నీ రోడ్డు మీదకు ఈడ్చాలని చూస్తున్నారా? పేదల పొట్టకొట్టాలని చూస్తున్నారా?

ఇదీ అసైన్డ్ భూముల నేపథ్యం

వివిధ కేటగిరీలకు చెందిన లబ్ధిదారులకు వ్యవసాయం కోసం భూమి అసైన్డ్ చేసే విధానం కొన్ని దశాబ్దాల క్రితం మొదలైంది. 1954కు ముందు అసైన్ చేసిన భూములది ఒక కేటగిరీ, 1954 తర్వాత మరో కేటగిరీ. 1954కు ముందు అసైన్డ్‌దారులకు ఇచ్చిన పట్టాల్లో ఎక్కడా అమ్ముకోకూడదనే షరతు లేదు. 1954 తర్వాత ఇచ్చిన అసైన్డ్ పట్టాల్లో మాత్రం ఈ నిబంధన పెట్టారు. దీంతో ఆ భూములన్నీ నిషేధిత జాబితాలో చేరాయి. వాటిని అమ్ముకునే అవకాశం లేదు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం చేసిన వెబ్‌ల్యాండ్ దుర్మార్గాల వల్ల 1954కు ముందు అసైన్డ్ చేసిన భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చారు. వాటిని తొలగించుకోవడానికి రెవిన్యూ అధికారుల చుట్టూ తిరిగి, లంచాలు ఇచ్చి విసిగిపోయిన రైతులు ఎంతో మంది ఉన్నారు. 1954 నుంచి కూడా పేదలకు భూములు ఇవ్వడం (అసైన్‌మెంట్లు) జరుగుతూనే ఉంది. అయితే 70 సంవత్సరాల తర్వాత కూడా ఆ భూముల మీద వారికి హక్కులు లేవు. రెండు, రెండున్నర ఎకరాల వరకూ అసైన్‌మెంట్ పట్టా ఉన్న వాళ్లు తమ అవసరాల కోసం ఒక అరెకరం అమ్ముకోవాలనుకుంటే చట్ట ప్రకారం అమ్ముకోవడం కుదరదు. దీంతో సాదా బైనామా (కాగితాల మీద రాసుకోవడం) పద్ధతిలో భూముల అమ్మకాలు జరిగాయి. దీనివల్ల నిరుపేదలైన అసైనీలకు రావాల్సిన రేటులో కనీసం 25 శాతం కూడా వచ్చేది కాదు. భూమిని అమ్ముకోకుండా సాగు చేసుకున్న వారు కూడా టైటిల్ లేకపోవడంవల్ల రెవెన్యూ శాఖ నుంచి ఎప్పుడైనా నోటీసులు వస్తాయని, ఆ భూమిని ప్రభుత్వం ఎక్కడ తీసేసుకుంటుందోనని, ఎక్కడ రిజర్వ్ చేస్తుందోనని భయాందోళనలు ఉండేవి. ఇటు అసైనీకి.. అటు కొనుక్కున్న వారికి లబ్ధి లేదు. మరోవైపు రెవెన్యూ రికార్డులు క్షేత్ర పరిస్థితిని తెలియజెప్పేలా లేవు. రికార్డులు ఒకరి పేరు మీద ఉంటే..

అసైన్డ్ భూములకు హక్కులపై 'ఈనాడు' వక్రభాష్యం



భూములు మరొకరి ఆధీనంలో ఉన్నాయి. ఇప్పటి వరకు సుమారు 19,21,855 మందికి 33,29,908 ఎకరాలను ప్రభుత్వాలు అసైన్‌మెంట్ చేస్తే.. ఆ రికార్డులేవీ క్షేత్ర స్థాయికి అనుగుణంగా లేవు.

అధ్యయనం తర్వాతే అసైన్డ్ చట్ట సవరణ

కలెక్టర్లు పలుమార్లు వైఎస్ జగన్ ప్రభుత్వం దృష్టికి అసైన్డ్ భూముల సమస్యను తీసుకువచ్చాక రెవెన్యూ మంత్రి నేతృత్వంలో 13 మంది ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలతో 2022 ఆగస్టు 30వ తేదీన ఒక కమిటీ వేశారు. ఆ కమిటీ కర్ణాటక, తమిళనాడులో పర్యటించి అక్కడి విధానాలపై అధ్యయనం చేసింది. అసైన్‌మెంట్ భూములకు సంబంధించి ఇతర రాష్ట్రాల్లో ఉన్న చట్టాలు, నియమ నిబంధనలను పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వానికి ఒక నివేదిక ఇచ్చింది. అసైన్ చేసిన 20 ఏళ్ల తర్వాత అసలైన ఒరిజనల్ లబ్ధిదారులకు, లేదా వారి వారసులకు అవసరమైనప్పుడు అమ్ముకునేందుకు వీలు కల్పించాలని, దానికి అనుగుణంగా ఏపీ అసైన్‌మెంట్ చట్టం (పీఓటీ)– 1977కు సవరణలు చేయాలని ఆ కమిటీ సిఫారసు చేసింది. దీనికి అప్పటి మంత్రివర్గం ఆమోదం తెలిపి, చట్టానికి సవరణలు చేసింది. అదే సందర్భంలో 20 ఏళ్లకు ముందే ఎవరైనా పేద రైతుల నుంచి భూములు కొనుక్కుని ఉంటే వారికి ఎలాంటి ప్రయోజనం ఉండదు. వారికి ఎలాంటి హక్కులూ రావు. వారి విషయంలో 1977 నాటి పీఓటీ చట్టం అమల్లో ఉన్నట్టే. దీనివల్ల అసైన్‌మెంట్ అయిన దగ్గర నుంచి 2023లో చట్ట సవరణ జరిగే వరకు అసైన్‌మెంట్ భూమిలో వ్యవసాయం చేసుకుంటున్న పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చెందిన రైతులకు మాత్రమే మేలు కలుగుతుంది. అంటే ఒరిజనల్ అసైనీలకు మాత్రమే లబ్ధి చేకూరుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో.. అందులో తప్పులు జరిగాయని, రద్దు చేయాలనే వాదనలో ఏమైనా అర్థం ఉందా? ఎవరికైనా లబ్ధి చేకూర్చాలనుకుంటే ఒరిజనల్ అసైనీలకే హక్కులు ఇవ్వాలనే షరతు చట్టంలో ఎందుకు పెడతారు?

27 లక్షల ఎకరాలపై పేదలకు హక్కులు

వైఎస్ జగన్ హయాంలో జరిగిన అసైన్డ్ చట్ట సవరణ ద్వారా సుమారు 15,21,160 మంది భూమిలేని నిరుపేదలకు వారికి సంబంధించిన 27,41,698 ఎకరాలపై పూర్తి యాజమాన్య హక్కులు లభిస్తున్నాయి. 20 సంవత్సరాలకు ముందు ఇచ్చిన భూములన్నింటికీ ఇది వర్తిస్తుంది. ఈ భూములన్నీ 1954 తర్వాత అసైన్‌మెంట్ చేసినవే.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో ఏపీ ముందడుగు

గత ప్రభుత్వంలో సీఎం జగన్ విప్లవాత్మక చర్యలే ఇందుకు కారణం

- పలు రంగాల్లో ముందు వరుసలో రాష్ట్రం
- 2023–24 సుస్థిరాభివృద్ధి లక్ష్యాల పురోగతి నివేదిక స్పష్టీకరణ
- మాతా, శిశు మరణాలు భారీగా తగ్గుదల
- 15.60% నుంచి 6.06%కి తగ్గిన పేదరికం
- విద్యలో పెరిగిన నాణ్యత.. ఎలిమెంటరీ, ఉన్నత విద్యలో పెరిగిన ఎన్‌రోల్‌మెంట్
- ఆస్పత్రుల్లోనే కాన్పులు 99.98 శాతం
- ఆరోగ్యశ్రీతో నాలుగింట మూడోవంతుకు పైగా కుటుంబాలకు ఆరోగ్య బీమా



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పలు రంగాల్లో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధనలో ఫ్రంట్ రన్నర్‌గా ముందుకు దూసుకుపోతోంది. 2020–21తో పోల్చితే 2023–24లో పేదరికం, మాతా శిశు మరణాల రేటు భారీగా తగ్గింది. ఆస్పత్రుల్లో కాన్పులు పెరగడంతో పాటు పిల్లలకు నూరు శాతం రోగ నిరోధక శక్తి టీకాలు విజయవంతంగా వేయించింది. విద్యలో నాణ్యత పెరగడంతో పాటు ఎలిమెంటరీ, ఉన్నత విద్యలో ఎన్‌రోల్‌మెంట్ పెరిగింది. రాష్ట్రంలో 80 శాతానికి పైగా కుటుంబాలకు ఆరోగ్య భరోసా లభించింది. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయా రంగాల్లో తీసుకున్న విప్లవాత్మక చర్యలే ఇందుకు కారణం. ఈ మేరకు నీతి ఆయోగ్ విడుదల చేసిన 2023–24 సుస్థిరాభివృద్ధి లక్ష్యాల పురోగతి నివేదిక స్పష్టం చేసింది. నీతి ఆయోగ్ నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్వయంగా ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించి సమీక్షించారు. అంతటితో ఆగకుండా గ్రామ, వార్డు సచివాలయాల స్థాయి నుంచి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనను అనుసంధానం చేశారు. నవరత్నాలతో పేదరికం.. మాతా శిశు మరణాలు తగ్గించడం, నాణ్యమైన విద్య, అర్హులందరికీ వైఎస్సార్ ఆరోగ్య శ్రీని వర్తింప చేయడం, ఆస్పత్రుల్లోనే కాన్పులు జరిగేలాగ చర్యలు తీసుకోవడంతో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ఆంధ్రప్రదేశ్ ఫ్రంట్ రన్నర్ రాష్ట్రాల్లో నిలిచింది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన మూడో నివేదికతో పోల్చితే నాలుగో నివేదికలో పలు రంగాల్లో ఆంధ్రప్రదేశ్ పురోగతిలో దూసుకుపోతున్నట్లు స్పష్టమైంది. పేదరికం శాతం 15.60 నుంచి 2023–24 నాటికి 6.06 శాతానికి తగ్గింది. పేదరికం తగ్గించడంలో తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఫ్రంట్ రన్నర్‌లో ఉన్నట్లు నివేదిక పేర్కొంది.

80.20% కుటుంబాలకు ఆరోగ్య భరోసా

ఆంధ్రప్రదేశ్‌లోని ఆరోగ్య బీమా పథకాన్ని 80.20 శాతం కుటుంబాలకు వర్తింప చేసినట్లు నివేదిక స్పష్టం చేసింది. అంతకు ముందు 74.60 శాతం కుటుంబాలకే ఆరోగ్య బీమాను వర్తింప చేశారని పేర్కొంది. మాతా శిశు మరణాలను తగ్గించడంలో ఆంధ్రప్రదేశ్ టాప్ ఐదు రాష్ట్రాల్లో ముందుంది. ప్రతి లక్ష జననాలకు ప్రసూతి మరణాల నిష్పత్తి 65 నుంచి 45కు ఆంధ్రప్రదేశ్‌లో తగ్గిందని, ప్రతి వెయ్యి సజీవ జననాల్లో ఐదేళ్లలోపు శిశు మరణాలు 33 నుంచి 27కు తగ్గాయని నివేదిక తెలిపింది. ఈ లక్ష్యాల్లో ఆంధ్రప్రదేశ్ మెరుగైన ఫలితాలను సాధించినట్లు నివేదిక వెల్లడించింది. 9 నుంచి 11 నెలల పిల్లలకు రోగ నిరోధక శక్తి టీకాలు ఇప్పించడంలో 87 శాతం నుంచి నూటికి నూరు శాతం లక్ష్యాలను సాధించిందని నివేదిక స్పష్టం చేసింది.

నీతి ఆయోగ్ నివేదిక ఇంకా ఏం చెప్పిందంటే..

- ఆస్పత్రుల్లోనే 99.98 శాతం కాన్పులు
- 87.98 శాతం నుంచి 96.90 శాతానికి పెరిగిన ఎలిమెంటరీ ఎన్‌రోల్‌మెంట్
- 46.84 % నుంచి 56.70 % శాతానికి పెరిగిన ఉన్నత సెకండరీ ఎన్‌రోల్‌మెంట్
- స్కూల్స్‌లో 91.26 % నుంచి 98.80 శాతానికి పెరిగిన తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు
- సెకండరీ స్థాయిలో శిక్షణ పొందిన ఉపాధ్యాయుల శాతం 75.18 నుంచి 82.50కి పెరుగుదల
- నూటికి నూరు శాతం మెరుగు పడిన గ్రామీణ జనాభాకు తాగునీటి సరఫరా
- నూరు శాతం మందికి సరసమైన ధరలకు స్వచ్ఛమైన ఇంధనం సరఫరా
- విద్యుత్ కనెక్షన్లలో నూరు శాతం లక్ష్య సాధన
- ఎల్‌పీజీ, పీఎన్‌జీ కనెక్షన్లలలో 103.56 శాతం లక్ష్య సాధన
- స్థిర ధరల ఆధారంగా 3.84% నుంచి 4.05% పెరిగిన తలసరి జీడీపీ వార్షిక వృద్ధి రేటు
- 5.70 శాతం నుంచి 4.40 శాతానికి తగ్గిన 15–59 ఏళ్ల మధ్య నిరుద్యోగిత
- రాష్ట్ర మొత్తం స్థూల ఉత్పత్తి విలువలో 9.5 శాతం నుంచి 12.79 శాతానికి పెరిగిన తయారీ రంగం విలువ

'నెట్టెంపాడు'కు నీటి పంపింగ్




ధరూరు/ మదనాపురం: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నుంచి నెట్టెంపాడు ఎత్తిపోతల పథకానికి నీటి పంపింగ్ కొనసాగిస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. నెట్టెంపాడు పంపు ద్వారా 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 131 క్యూసెక్కులు, ఇతర అవసరాలకు 2 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 390 క్యూసెక్కులు కలిపి మొత్తం ప్రాజెక్టు నుంచి 1,273 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి ఎలాంటి ఇన్‌ఫ్లో లేదన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.498 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

రామన్‌పాడు నుంచి 450 క్యూసెక్కులు

మదనాపురం మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటిమట్టం నిలకడగా ఉంది. అయితే జూరాల సమాంతర, ఎడమ కాల్వల ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. శనివారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగులకు చేరింది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 450 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ రనీల్‌రెడ్డి చెప్పారు.

ఇసుక రవాణాను అడ్డుకున్న వారిపై దాడి



ప్రమాదంలో దెబ్బతిన్న బైక్

మిడ్జిల్: మండలంలోని వాడ్యాల్ గ్రామంలో శుక్రవారం రాత్రి అనుమతి లేకుండా రెండు ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్న వారిని వెల్‌జాల్ సమీపంలో వాడ్యాల్‌కు చెందిన మధు, ప్రశాంత్, రంజిత్ అనే యువకులు అడ్డుకున్నారు. ట్రాక్టర్లకు అడ్డుగా బైక్ పెట్టడంతో డ్రైవర్లు బీర్ల రమేష్, బెల్లె భీమయ్య ట్రాక్టర్లను ఎక్కించి తీసుకెళ్లారు. అడ్డుపడిన వారిపై దాడికి పాల్పడ్డారు. వారిపై చర్యలు తీసుకోవాలని శనివారం గ్రామానికి చెందిన మధు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై ఏఎస్ఐ బాలకృష్ణను వివరణ కోరగా సీఐ విచారణ చేస్తున్నారని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఖిల్లా కోటపై మొహర్రం



ఖిల్లా కోటపై బీబీ ఫాతిమాకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



కోటపైకి చేరుకుంటున్న భక్తులు

- కందూర్‌లతో బీబీ ఫాతిమాకు మొక్కులు
- పోటెత్తిన భక్తజనం

కోయిల్‌కొండ: మతసామరస్యానికి ప్రతీక అయిన మొహర్రం పండుగ పట్టణంలో వైభవంగా కొనసాగుతోంది. పది రోజుల పాటు రాష్ట్ర నలుమూలల నుంచేగాక ఇతర రాష్ట్రాల భక్తులు సైతం కోయిల్‌కొండ కోటకు చేరుకొని బీబీ ఫాతిమాను దర్శించుకుంటారు. వారంరోజులుగా వేల సంఖ్యలో భక్తులు దర్శించుకొని పొట్టేళ్లు, మేకపోతులను బలిచ్చి కందూర్‌లు నిర్వహిస్తూ మొక్కులు చెల్లించుకుంటున్నారు. కోట నుంచి కిలోమీటర్ల మేర పొడవునా దుకాణాలు వెలిశాయి. మహిళా భక్తులు బొడ్డెమ్మలు, కోలాటాలతో బీబీ ఫాతిమా పాటలు పాడుతూ తమ భక్తిని చాటుకుంటున్నారు. గ్రామంలో 10 ప్రాంతాల్లో పీర్లను ప్రతిష్ఠించి ఒక్కో పీరుకు ఒక్కో రోజు ఉత్సవం నిర్వహిస్తారు. చివరిరోజు అన్ని పీర్లతో గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తారు.

ఆకట్టుకునే సవార్లు..

యుద్ధంలో బీబీ ఫాతిమా భర్త మొగులాలి మరణం పొందుతారు. ఈ విషయాన్ని మొగులాలి చేతిలో ఉన్న డాల్‌సాబ్ బీబీ ఫాతిమా పీరుకు చెప్పడానికి వస్తుంది. భర్త వీర మరణం వార్త వినరాదని డాల్‌సాబ్ పీరును తప్పించుకొని బీబీ ఫాతిమా పీరు వెళ్లే సందర్భం అందరినీ ఆకట్టుకుంటుంది. దీంతో పాటు ఇమాం ఖాసీం, ఉస్సేన్‌పాషా, చాన్‌దూల, గండేల్‌సాబ్ పీర్ల సవార్లు కనువిందు చేస్తాయి.

వీధివీధినా అలయ్ బలయ్‌లు..

గ్రామంలోని మసీద్‌లలో 10 రోజుల పాటు ప్రతిష్ఠించిన పీర్ల ముందు అలయ్ బలయ్ ఆడుతారు. ఆడపడుచులు, బంధువులు కోయిల్‌కొండకు చేరుకొని కందూర్‌లు నిర్వహిస్తారు.

పర్యాటకులకు కనువిందు..

ఖిల్లా కోటపై పూర్వం రాజులు నిర్మించిన కోటలు, బురుజులు, ఫిరంగులు, అక్కడక్కడ 15కుపైగా ఉన్న కోనేర్లు ఉత్సవాలకు వచ్చే భక్తులకు కనువిందు చేస్తాయి. అంతేగాక కోట చివరన కోయిల్‌సాగర్ బ్యాక్‌వాటర్ కనిపిస్తుంది.

ఐక్యతకు గుర్తింపు..

హిందూ ముస్లింలు ఐక్యతగా జరుపుకొనే పండుగగా మొహర్రం చెప్పుకోవచ్చు. ఉత్సవాల ప్రారంభం నుంచి చివరిరోజు వరకు ఇరువర్గాల వారు అన్ని కార్యక్రమాలను కలిసి మెలసి నిర్వహిస్తారు. అంతేగాక ఖిల్లాపై కొలువుదీరిన బీబీ ఫాతిమాను దర్శించుకోవడానికి రాబ్జీ వర్గానికి చెందిన ముస్లింలు ప్రతి ఏటా వచ్చి 3వ రోజు నుంచి 7వ రోజు వరకు నల్లదుస్తులు ధరించి తమ భక్తిని చాటుతూ ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.


కల్యాణం.. కమనీయం

- వైభవంగా సుదర్శన పాశుపత సహిత లక్ష్మీనారాయణ, నవగ్రహ హోమాలు
- 22 మంది దంపతులతో పుత్ర కామేష్టి యాగం
- శ్రీకాలచక్ర యాగశాలను దర్శించుకున్న లింగ అఘోరాలు
- భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగిన యాగ మండపం



యాగం నిర్వహిస్తున్న కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజి

నాగర్‌కర్నూల్: శ్రీభూనీల సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం భక్తుల గోవింద నామస్మరణ మధ్య వైభవంగా జరిగింది. నాగర్‌కర్నూల్‌లోని హౌసింగ్‌బోర్డ్ కాలనీలో 83వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవంలో భాగంగా ప్రధాన యాగశాల ముందు ప్రతిష్ఠను శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజి చేశారు. శనివారం భక్తులు సామూహికంగా శ్రీ సుదర్శన పాశుపత సహిత లక్ష్మీనారాయణ, నవగ్రహ హోమాలు, 75 మంది దంపతులచే సుదర్శన హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఐశ్వర్యం, విజ్ఞానం, బుద్ధి శౌర్యం, ప్రసన్నత, కార్యసిద్ధి కోసం ఈ హోమాలు సహకరిస్తాయని కృష్ణజ్యోతి స్వామీజి అన్నారు. గ్రహాల అనుకూలత, భయబీతులు తొలగిపోవడానికి, శత్రు సంహారానికి, శత్రువులపై విజయం సాధించడానికి అయుత చండీ, అతిరుద్ర యాగాన్ని జరిపారు. ఈ నెల 7 నుంచి 21 వరకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా 7వ రోజు శనివారం ఉదయం గోపూజ, యాగశాల ప్రదక్షిణ మొదలు అత్యంత వైభవంగా వేద, చండీ, రుద్ర హోమాలు, రామాయణం, భాగవత, సుందరకాండ చతుర్వేద హోమాలు జరిపించారు. అలాగే నిత్యం జరిగే సామూహిక హోమాలలో భాగంగా సంతాన ప్రాప్తికి పుత్ర కామేష్టి హోమాలు 22 మంది దంపతులతో నిర్వహించారు. ఈ క్రమంలో కాశీ నుంచి శ్రీశైలం వెళ్తున్న లింగ అఘోరాలు శ్రీకాళచక్ర యాగశాల ప్రత్యేక పూజలను దర్శించి భక్తులకు ఆశీర్వచనం చేశారు. సాయంత్రం ఎంతో వైభవంగా శ్రీ భూనీల సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం వేలాది భక్తుల మధ్య గోవింద నామస్మరణ మధ్య గావించారు. లోక కల్యాణార్థం, విశ్వశాంతి కోసం శ్రీవారి కల్యాణోత్సవం జరిపించామని చెప్పారు. పూజ అనంతరం బ్రాహ్మణులు భక్తులందరికీ వేద ఆశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు. ఆదివారం ఉదయం శ్రీ సూర్య సరస్వతి హోమంలో సూర్య నమస్కారాలు, పుత్ర కామేష్టి హోమాలు, సాయంత్రం 6 గంటలకు జ్ఞాన సరస్వతి అమ్మవారి కటాక్షాలు పొందడానికి ఎనిమిదేళ్లలోపు ఆడపిల్లలకు బాల పూజలు, సహస్ర జ్యోతిర్లింగార్చన వేద మూర్తులైన బ్రాహ్మణులచే శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం వేళలో చిన్నారులు పుస్తకాలు, పెన్నులు, బలపాలు, పలకలు తెచ్చుకోవాలని సూచించారు.



హోమంలో పాల్గొన్న భక్తులు

వడ్డీ ఆశజూపి మోసం చేసిన వ్యక్తిపై విచారణ జరపాలి



మాట్లాడుతున్న రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హన్మంతరావు

నాగర్‌కర్నూల్: జిల్లాకేంద్రంలో అధిక వడ్డీ ఇస్తానంటూ రూ.కోట్లలో మోసానికి పాల్పడిన సాయిబాబా అనే వ్యక్తిపై విచారణ జరపాలని రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హన్మంతరావు అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంతకు ముందు ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. సదరు వ్యక్తి పాలమూరు– రంగారెడ్డి, కేఎల్ఐ ప్రాజెక్టుల్లో పరిహారం వచ్చిన రైతులే లక్ష్యంగా మోసాలకు పాల్పడ్డాడన్నారు. సాయిబాబా చేతిలో నాగర్‌కర్నూల్ జిల్లాలోనే కాకుండా నల్లగొండ, మహబూబ్‌నగర్, గుంటూరు జిల్లాలకు చెందిన బాధితులు కూడా ఉన్నారన్నారు. కేవలం కేసు నమోదు చేసి జైలుకు పంపడమే కాకుండా బినామీలపై విచారణ జరపాలన్నారు. ఇది మొత్తం రూ.100 కోట్ల స్కాం ఉందని, పేదల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడ్డాడన్నారు. ఇతని వెనక ఎవరెవరు ఉన్నారు.. డబ్బు ఎక్కడికి పోయిందో విచారణ జరిపి పేదలకు న్యాయం చేయాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి డ్రగ్స్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో.. పేదలను వడ్డీల పేరుతో మోసం చేసే వారిపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు.

మణిపూర్ హింస సంవిదాన్‌కా హత్య కాదా?

ఎమర్జెన్సీపై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను వీహెచ్ ఖండించారు. 1975లో విధించిన ఎమర్జెన్సీని హత్యాదివస్ అని అమిత్ షా వ్యాఖ్యానించడం సరైంది కాదన్నారు. ఎమర్జెన్సీ సమయంలో ఎవరూ చావలేదని, ఎమర్జెన్సీ పేరుతో రోడ్లపైకి వచ్చిన ప్రతిపక్ష నాయకులను అరెస్ట్ మాత్రమే చేశారన్నారు. 2002లో గుజరాత్‌లో జరిగిన హింస, మణిపూర్‌లో జరుగుతున్న హింస సంవిధాన్‌కా హత్య కాదా అని ప్రశ్నించారు. ఎమర్జెన్సీ తర్వాత కాంగ్రెస్ పార్టీ ఎన్నోసార్లు అధికారంలోకి వచ్చిన విషయాన్ని గుర్తించుకోవాలని హితవు పలికారు. మా కల్చర్ రివేంజ్ కాదని, సర్వీస్ అన్నారు. ఏడాది నుంచి మణిపూర్‌లో అల్లర్లు జరుగుతున్నా మోదీ ఒక్కసారైనా అక్కడికి వెళ్లారా అని ప్రశ్నించారు. బీజేపీ చేసేవన్నీ రాజ్యాంగ వ్యతిరేక విధానాలేనని, ఎవరు ఎదురు తిరిగినా ఈడీని ప్రయోగిస్తారని ఆరోపించారు. టీడీపీలో ఉన్న నాయకులు ఇప్పుడు బీజేపీలో ఎమ్మెల్యేలు, ఎంపీలుగా లేరా.. మీ పార్టీకి వస్తే అందరూ హరిశ్చంద్రులు అవుతారా అని నిలదీశారు. సమావేశంలో నాయకులు నర్సింహారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆర్థిక సమస్యలు తీర్చండి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డి కృషిచేయాలని ఆల్‌మైనార్టీ ఎంప్లాయిస్ వర్కర్స్ అసోసియేషన్ (ఆల్‌మేవా) రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ అన్నారు. జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో శనివారం జరిగిన ముఖ్య ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, 50 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ, భవిష్యనిధి, సరేండర్ లీవ్, మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం గజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన ఫారుఖ్ హుస్సేన్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. సమావేశంలో ఆల్‌మేవా జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి మహ్మద్ అయూబ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సయ్యద్ వహీద్‌షా, సయ్యద్ ఖాజా నిజాముద్దీన్, జైనుల్లా అబెదిన్, మహ్మద్ హకీం, అఖిల్, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.